
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 28 । మే । 2023



చేరాల్సిన సమయానికి..!

సికింద్రాబాద్ నుంచి కొత్తగూడెం మార్గంలో నడిచే మణుగూరు ఎక్స్‌ప్రెస్ రైలు గంటల తరబడి ఆలస్యంగా వస్తోంది. 8లో



రామాలయంలో అక్రమాలు

భద్రాచలం రామాలయంలో అవినీతి డొంక కదులుతోంది. దీంతో ఒక్కొక్కరి అక్రమ బాగోతాలు బయటపడుతున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 42° / 27°

జిల్లాలో ఆదివారం ఎండ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. రాత్రికి కూడా వాతావరణం వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

4న జ్యేష్ఠాబిషేక పూజలు

జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా జూన్ 4న రామాలయంలో జ్యేష్ఠాభిషేకోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ ఈఓ రమాదేవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివారి నిత్యకల్యాణం, తిరువీధి సేవ, పవళింపు సేవలు రద్దు చేస్తున్నట్లు వివరించారు.

దశాబ్ది వేడుకలు పండుగలా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పండుగ వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఉత్సవాల నిర్వహణపై ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. జూన్ 2 నుంచి 21వ తేదీ వరకు శాఖల వారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ప్రతీ వార్డు, పల్లె, పట్టణం, గ్రామం, మండలం, మున్సిపాలిటీ, జిల్లాస్థాయిలో అంగరంగ వైభవంగా వేడుకలు నిర్వహించాలని, ప్రజలను, ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన ఐసెట్

సుజాతనగర్: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఐసెట్ పరీక్షలు రెండో రోజు శనివారంతో ముగిశాయి. మొదటి సెషన్ పరీక్షకు 107 మందికి గాను 101 మంది, రెండో సెషన్‌లో 107 మందికి 99 మంది హాజరయ్యారని, రెండు సెషన్లలో కలిపి 14 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

పీఓను కలిసిన డీడబ్ల్యూఓ

భద్రాచలం: జిల్లా సంక్షేమాధికారి సబిత శనివారం ఐటీడీఏ పీఓ గౌతమ్ పోట్రును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పీఓను ఆమెను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ముగియగానే చిన్నారులకు న్యూట్రిషన్, గర్భిణులకు బాలామృతం అమలయ్యేలా చూడాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లీపిల్లల సంరక్షణ, వికలాంగుల సంక్షేమంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సీఎం కప్ పోటీలకు క్రీడాకారులు



బస్సులను ప్రారంభిస్తున్న సీతారాం

కొత్తగూడెంటౌన్: హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీలకు జిల్లా నుంచి 156 మంది క్రీడాకారులు శనివారం తరలివెళ్లారు. కొత్తగూడెం బస్టాండ్ నుంచి హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియం వరకు వెళ్తున్న క్రీడాకారుల బస్సులను జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి టి.సీతారాం ప్రారంభించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన 102 మంది పురుషులు, 54 మంది మహిళలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ మేనేజర్ ఉదయ్‌కుమార్, తిరుమలరావు, లక్ష్మయ్య, ప్రేమ్‌కుమార్, వేణుగోపాల్, నరేష్, మంగీలాల్, సుజాత, సీతాదేవి, స్టెల్లా పాల్గొన్నారు.

సేవలు అరకొరే !



కొత్తగూడెంలోని ప్రభుత్వ ఆస్పత్రి

ఏజెన్సీలో పూర్తిస్థాయిలో అందని వైద్యం

- వేధిస్తున్న వైద్యులు, సిబ్బంది కొరత
- పలు మండలాల్లో ప్రబలుతున్న విషజ్వరాలు
- జిల్లాలో నేటి నుంచి కేంద్ర బృందం పర్యటన

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో సామాన్యులకు వైద్య సేవలు అరకొరగానే అందుతున్నాయి. కొన్ని పీహెచ్‌సీలు 12 గంటలు మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో ఏజెన్సీ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కూలీ పనులు చేసే కుటుంబాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే మిగితా వారు సైతం పనులు మానేసి రూ.వందల కొద్దీ చార్జీలు పెట్టుకుని వస్తే.. మంచి వైద్యం కరువే అవుతోంది. ఇక డాక్టర్లు మందులు రాస్తే కొన్ని బయట దుకాణాల్లో కొనుక్కోవాల్సిన దుస్థితి స్వయంగా జిల్లా ఆస్పత్రిలోనే ఉంది. నేటి నుంచి జిల్లాలో పర్యటించనున్న కేంద్ర బృందమైనా ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

కేంద్ర బృందం పరిశీలించే ఆస్పత్రులివే..

కేంద్ర వైద్య బృందం ఆదివారం నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో పర్యటించనుంది. బృందం సభ్యులు ఏడాదికోసారి జిల్లాలో తనిఖీలు నిర్వహించి ఆస్పత్రుల్లో అందుతున్న సేవలపై ఆరా తీస్తారు. ప్రధానంగా పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, పల్లె దవాఖానాలు, హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల పనితీరును తనిఖీ చేస్తారు. వైద్య విధాన పరిషత్ పరిధిలోని ఆస్పత్రుల పనితీరు, పథకాల అమలును పరిశీలిస్తారు. 108, 102 వాహనాల ద్వారా ప్రజలకు, రోడ్డు ప్రమాదాల బాధితులకు అందుతున్న సేవలు, ఇంకా చేయాల్సిన పనులపై జిల్లా అధికారులతో చర్చిస్తారు.

ప్రధాన సమస్యలు ఇలా...

జిల్లా ఆస్పత్రిలో తగిన సదుపాయాలు, పరికరాలు దశల వారీగా వస్తున్నప్పటికీ తగిన వైద్యులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. స్టాఫ్ నర్సులు, నర్సులు, ఫార్మసిస్టులు సరిపడా లేరు. జిల్లాలో 108 వాహనాలు 21 ఉండగా వాటిలో 15 వాహనాలు మూడు లక్షల కిలో మీటర్లు తిరిగాయి. మూడు లక్షలు కిలో మీటర్లు దాటితే వాటిని స్క్రాప్ కింద పరిగణించాల్సి ఉండగా వాటిని ఇంకా తిప్పుతూనే ఉన్నారు. 102 వాహనాలు కండీషన్‌లో ఉన్నప్పటికీ సిబ్బంది కొరత ఉంది. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో నడిచే పీహెచ్‌సీల్లో 24 గంటలు సేవలందించాల్సి ఉండగా ఆళ్లపల్లి వంటి కొన్ని పీహెచ్‌సీలు 12 గంటలు మాత్రమే నడుస్తున్నాయి. కొత్తగూడెం పట్టణ పరిధి రామవరంలోని ఎంసీహెచ్‌లో గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందిస్తున్నప్పటికీ.. పుట్టిన శిశువులు కొందరిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలిస్తున్నారు. ఈ సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

విష జ్వరాలతో విలవిల..

జిల్లాలోని చర్ల, లక్ష్మీదేవిపల్లి మండలాల్లోని మారుమూల గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఆయా గ్రామాల్లో కొందరు ప్రభుత్వ వైద్యంపై నమ్మకం లేక ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.వేలు ఖర్చు చేసి చికిత్స పొందుతున్నారు. ఇక అర్ధరాత్రి, తెల్లవారుజామున అనారోగ్య పరిస్థితులు తలెత్తితే కొన్ని పీహెచ్‌సీలు, ప్రభుత్వ ఎవరూ అందుబాటులో ఉండడం లేదని, రాత్రి విధులు నిర్వహించే వైద్యులు, సిబ్బంది సకాలంలో స్పందించడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. 108, 102 వాహనాలు తరుచూ మరమ్మతులకు గురవుతుండడంతో ప్రజలతో పాటు వాటిలో పనిచేసే సిబ్బంది సైతం ఇబ్బంది పడుతున్నారు.

పథకాల అమలు, పని తీరును పరిశీలిస్తారు



జిల్లాలో వైద్యారోగ్య శాఖ, వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో అమలవుతున్న పథకాలను కేంద్ర బృందం సభ్యులు పరిశీలిస్తారు. వైద్యులు, సిబ్బంది పని తీరును కూడా తనిఖీ చేస్తారు. జిల్లాలో నేటి నుంచి నాలుగు రోజుల పాటు పర్యటిస్తారు.

– శిరీష, డీఎంహెచ్‌ఓ

ఎన్నికలప్పుడే గుర్తొస్తారా ?



పోడురైతు భరోసా యాత్రలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోరం కనకయ్య, పాయం వెంకటేశ్వర్లు తదితరులు

- ప్రతీ పోడు రైతుకూ పట్టా ఇవ్వాల్సిందే
- నాలుగున్నరేళ్లుగా హామీలే తప్ప ఆచరణ లేదు..
- మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- కొత్తగూడెంలో భారీగా పోడు రైతు భరోసా యాత్ర



అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న పొంగులేటి తదితరులు

చుంచుపల్లి: ప్రతీ పోడు రైతుకూ పట్టా మంజూరు చేయాలని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. పోడు రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం కొత్తగూడెంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు పోడు రైతు భరోసా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పోడు రైతుల పట్ల మొండి వైఖరి అవలంబిస్తోందని విమర్శించారు. గిరిజనులు, ఆదివాసీలు, గిరిజనేతరులు తరతరాలుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాల మంజూరులో మీన మేషాలు లెక్కించడం తగదన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో గిరిజనులకు, గిరిజనేతరులకు పోడు పట్టాలు జారీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించారని, నేటికీ ఏ ఒక్కరికీ పట్టా ఇవ్వలేదని, ఎన్నికల సమయంలోనే గిరిజనులు, పోడు రైతులు గుర్తొస్తారా అని ప్రశ్నించారు. 2018 ఎన్నికల సమయంలో ప్రతీ రైతుకు తానే స్వయంగా కుర్చీ వేసుకుని కూర్చుని పట్టాలిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి.. నాలుగున్నరేళ్లు దాటినా మాట నిలుపుకోలేదని విమర్శించారు. వేలాది మంది గిరిజన కుటుంబాల ఉసురుపోసుకున్నారని, పోడు రైతులను రోడ్డు పాలు చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఆరోపించారు. సుమారు 4.41 లక్షల కుటుంబాలు 13లక్షల ఎకరాల పోడు పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్నాయని, అందులో 11 లక్షల ఎకరాలకు పట్టాలిస్తామని గత డిసెంబర్‌లో ప్రకటించిన కేసీఆర్ ఇప్పుడు నాలుగు లక్షల ఎకరాలకే ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. పోడు సాగు చేసుకుంటున్న గిరిజనులపై అక్రమ కేసులు బనాయించారని, వాటిని తక్షణమే ఉపసంహరించాలని అన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు పట్టా ఇవ్వకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య మాట్లాడుతూ ప్రతీసారి ఎన్నికల సమయంలో మాత్రమే పోడు అంశాన్ని సీఎం తెరపైకి తెస్తున్నారని, గద్దెనెక్కాక ఆ ఊసే ఎత్తడం లేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు గిరిజనులు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడు తూ గతంలో పోడు భూములపై ఆధారపడి జీవి స్తున్న గిరిజనులకు పిలిచి పట్టాలు ఇచ్చిన ఘనత దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డికే దక్కుతుందని చెప్పారు. 2014 నుంచి కేసీఆర్ పోడు సాగుదారులకు పట్టాలిస్తానని వాగ్దానాలు చేస్తూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, మార్క్‌ఫెడ్ మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, కొండూరి సుధాకర్, తుంబూరి దయాకర్‌రెడ్డి, ఊకంటి గోపాలరావు, తూము చౌదరి, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, తుళ్లూరు బ్రహ్మయ్య, ముప్వ విజయబాబు, మల్లిబాబు యాదవ్, నారపోగు వెంకట్, ముత్తినేని సుజాత, తాండ్ర నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ చాంబర్ డోర్‌కు నమస్కారం !

సూపర్‌బజార్(కొత్తగూడెం): రైతు భరోసా యాత్ర అనంతరం వినతిపత్రం ఇవ్వడానికి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వచ్చిన సమయంలో కలెక్టర్ అనుదీప్ అందుబాటులో లేరు. దీంతో 'పోడు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వాలని వచ్చాం.. ఆయన అందుబాటులో లేకపోవడంతో చాంబర్ డోర్‌కు నమస్కారం పెడుతున్నాం.. అధికారులు ఎవరుంటే వారికి వినతిపత్రం ఇస్తాం.. మీడియా ద్వారా కలెక్టర్‌ను కోరేది ఒక్కటే.. పోడు రైతులకు న్యాయం చేయండి' అని పొంగులేటి చేతులెత్తి నమస్కరిస్తూ అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందించారు.

ఖిల్లాపై కాషాయ జెండా ఎగరేస్తాం..

- సీతారామ ప్రాజెక్టులోకి గోదావరి జలాలు వచ్చేదెన్నడు?
- భద్రాచలానికి కేసీఆర్ తలంబ్రాలు ఎందుకు తీసుకురావడం లేదు..
- లీకేజీలపై విచారణకు అభ్యంతరమేమిటో చెప్పాలి..
- నిరుద్యోగ మార్చ్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్



సభలో మాట్లాడుతున్న బండి సంజయ్, పక్కన పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులు

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం వస్తే సాయిగణేష్ గుర్తుకువస్తాడు.. ఇక్కడ ఫైట్ చేస్తున్న కాషాయ కార్యకర్తలకు నా సెల్యూట్.. ఖమ్మంలో బీజేపీ ఎక్కడ ఉందని వాగిన నేతలు నిరుద్యోగ మార్చ్‌కు వచ్చిన వారిని చూడాలి.. ఇదే స్ఫూర్తితో ఖమ్మం ఖిల్లాపై వచ్చే ఎన్నికల్లో కాషాయ జెండా ఎగురవేస్తాం.. అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ వెల్లడించారు. ఖమ్మంలో ఆ పార్టీ ఆధ్వర్యన శనివారం నిరుద్యోగ మార్చ్ నిర్వహించారు. జెడ్పీ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలు చల్లి నివాళులర్పించాక పాత బస్టాండ్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సంజయ్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో కాషాయ జెండా ఎగరేసి తీరుతామన్నారు. ఖమ్మం ఉద్యమాల ఖిల్లా, చైతన్యవంతమైన జిల్లా అని అన్నారు. కేసీఆర్ కుటుంబంతో తెలంగాణ రాలేదని, ఆయన ఖమ్మంలో దొంగ దీక్ష చేశాడని మండిపడ్డారు. అప్పట్లో ఎంపీ సుష్మాస్వరాజ్ మద్దతు తెలపడం, 1,400 మంది యువత బలిదానంతోనే తెలంగాణ వచ్చిందని చెప్పారు. కేసీఆర్ బిడ్డ లిక్కర్ దందా కోసం నిధులు ఉంటాయి కానీ ఖమ్మం జిల్లాతోపాటు తెలంగాణ ప్రజలకు లబ్ధి జరిగేలా పథకాల అమలుకు నిధులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టులోకి గోదావరి జలాలు ఇంకా ఎందుకు రావడం లేదు, సీఎం కేసీఆర్ భద్రాద్రి రాముడికి తలంబ్రాలు ఎందుకు తీసుకురావడం లేదు, భద్రాద్రి అభివృద్ధి కోసం రూ.100 కోట్లు ఇస్తామన్న హామీ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదేమైనా ఐదు నెలల్లో రామరాజ్యం వస్తుందని, అప్పటివరకు యువత ఓపిక పట్టాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అడ్రస్ ఎప్పుడో గల్లంతైందని, ఆ పార్టీ ఎక్కడ పోటీ చేసినా డిపాజిట్లు కూడా రావడం లేదని ఎద్దేవా చేశారు. ఏ ఎన్నికలొచ్చినా బీజేపీ ఓటింగ్ శాతం పెరుగుతోందే తప్ప తగ్గడం లేదన్నారు. బీజేపీ దెబ్బకు తానే నికార్సయిన హిందువునని కేసీఆర్ ప్రకటించుకుంటున్నా జనం నమ్మడం లేదన్నారు.

మీ కుటుంబానికే ఉద్యోగాలు..

నిరుద్యోగుల కోసం పోరాడుతోంది.. లాఠీ దెబ్బలు తింటోంది, జైలుకు పోతోంది బీజేపీ నేతలేనని సంజయ్ తెలిపారు. కేసీఆర్ కుమారుడు, అల్లుడు రెండుసార్లు మంత్రులయ్యారని, బిడ్డ ఓడినా ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని, మరి నిరుద్యోగులు ఏం పాపం చేశారని వారి ఉసురు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. పేపర్ లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడానికి అభ్యంతరాలు ఏంటో చెప్పాలన్నారు. నిరుద్యోగుల తరఫున పోరాడుతున్న తనను పదో తరగతి పేపర్ లీకేజీ పేరుతో జైలుకు పంపారని, అయినా భయపడేది లేదని, చావడానికైనా సిద్ధమేనని చెప్పారు. ప్రధాని మోదీ శిష్యుడిని, అమిత్‌షా, నడ్డా అభిమానైన తాను ప్రజల కోసం ఎందాకైనా పోరాడుతానన్నారు. అధికారాలు ఇవ్వకుండా స్థానిక ప్రజాప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా కేసీఆర్ మార్చారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పంచాయతీలకు అధికారాలు ఇవ్వడంతోపాటు కేంద్రంతో మాట్లాడి నిధులు తీసుకొచ్చి వాటిని బలోపేతం చేస్తామని సంజయ్ తెలిపారు.

ఫ్లెక్సీల్లో కనిపించని ఈటల

బీజేపీ ఆధ్వర్యాన ఖమ్మంలో నిర్వహించిన నిరుద్యోగ మార్చ్ కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కటౌట్లలో ఆ పార్టీ చేరికల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఫొటో కనిపించలేదు. ఉద్దేశపూర్వకంగానే తమ నేత ఫొటోలు పెట్టలేదని ఆయన అనుచరులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇటీవల ఈటల నేతృత్వంలోని చేరికల కమిటీ ఖమ్మం వచ్చింది. అప్పుడు జిల్లా కమిటీకి సమాచారం ఇవ్వలేదని ప్రచారం జరిగింది. తాజాగా నిరుద్యోగ మార్చ్‌లో ఈటల ఫొటో లేకపోవడంపై అనుచర నేతలు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు, పార్టీ తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీ రవీంద్ర నాయక్, మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు, డాక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్.ప్రభాకర్, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ, నాయకులు కాసం వెంకటేశ్వర్లు, బండారి శాంతికుమార్, దేవకి వాసుదేవరావు, అల్లిక అంజయ్య, శ్యాంరాథోడ్, దొంగల సత్యనారాయణ, దొడ్డా అరుణ, రాకేష్‌రెడ్డి, పుల్లారావు, ఉప్పల శారద పాల్గొన్నారు.

పేదలకు 'పోడు' హక్కులు కల్పించాలి



రేగళ్ల సభలో మాట్లాడుతున్న కూనంనేని

కొత్తగూడెంరూరల్: ఆనాదిగా గిరిజన, గిరిజనేతర పేదల సాగులో ఉన్న పోడు, అంబసత్రం భూములపై హక్కులు కల్పించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కోరారు. శనివారం లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల, గట్టుమళ్ల, బంగారుచెలక, మైలారం, బొజ్జలగూడెం గ్రామాల్లో ప్రజాగర్జన ప్రచార సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 2005కు పూర్వం నుంచి సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం సర్వేల పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. పోడుపట్టాల సంఖ్యను కుదించే ప్రయత్నాలను విరమించుకోవాలన్నారు. ఈజీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. వచ్చే నెల 4న నిర్వహించే సభకు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, లక్ష్మీపతి, గోవింద్, ఉపేందర్, కంటెం సత్యనారాయణ, రాజశేఖర్, దారా శ్రీనివాసరావు, కుంజా రాంబాబు, రాజబాబు, కొమరం లలిత, కారం జనార్దన్ పాల్గొన్నారు.

సీఎం కృషితోనే ప్రజల ముంగిటకు వైద్యం



దయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందు: సీఎం కేసీఆర్ కృషితో ప్రజల ముంగిటకు ప్రభుత్వ వైద్యం అందుబాటులోకి వచ్చిందని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో రూ.50 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏడాది క్రితం వరకు ఇక్కడ సామాన్యులకు వైద్యం అందలేదని, ఆస్పత్రి వైద్య విధాన పరిషత్‌లోకి మారిన తర్వాత ఉన్నత వైద్యుల నియామకంతో పాటు సౌకర్యాలు పెరిగాయని చెప్పారు. అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య భారీగా పెరిగిందని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలపై వైద్యులు, సిబ్బంది దృష్టి సారించాలని కోరారు. డయాలసిస్ సెంటర్‌లో ప్రస్తుతం ఐదు పడకలు ఉన్నాయని, వీటిని మరింతగా పెంచేలా అనుమతి కోసం ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. మూడు జిల్లాలకు సెంటర్‌గా ఉన్న ఇల్లెందు ఆస్పత్రిని 100 పడకల హాస్పిటల్‌గా అభివృద్ధి చేస్తామన్నారు. ఇప్పటికే ప్రత్యేక వైద్య నిపుణులు, రేడియాలజిస్ట్ అందుబాటులో ఉన్నారని, స్కానింగ్ సదుపాయం కూడా ఉందని అన్నారు. డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల అప్‌గ్రేడ్ అయిన తర్వాత సదుపాయాల కల్పన, వైద్యులు, సిబ్బంది నియామకంతో మెరుగైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. జిల్లాలోని ఇల్లెందు, మణుగూరు, భద్రాచలం, అశ్వారావుపేట ఆస్పత్రులు వైద్య విధాన పరిషత్‌లోకి మారాయని చెప్పారు. భద్రాచలంలో త్వరలో కంటి శస్త్ర చికిత్సకు కూడా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగాల రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, కమిషనర్ అంకుషావలి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష్, ఆర్‌ఎంఓ డాక్టర్ హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజాగర్జన సభను విజయవంతం చేయండి

మణుగూరు రూరల్: వచ్చేనెల 4న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ప్రజాగర్జన బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కే.షాబీర్‌పాషా పిలుపునిచ్చారు. పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే అజెండాగా ఉద్యమిస్తున్నట్లు తెలిపారు. నాయకులు మున్నా లక్ష్మీకుమారి, సరెడ్డి పుల్లారెడ్డి, కమటం వెంకన్న, రేసు ఎల్లయ్య, డి.సుధాకర్, నర్సింహారావు, సర్వర్, కుటుంబరావు, సురేష్, పి శ్రీనివాస్, మనోహరాచారి, రమేష్, సర్పంచ్ సతీష్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

అశ్వారావుపేటరూరల్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ కళాశాల 32వ వార్షికోత్సవాలను శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ ఇక్కడ చదివిన విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాల్లో ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పల్లె ప్రకృతి వనాల్లో సహపంక్తి భోజనాలు

ఇల్లెందురూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించింది. పల్లె ప్రకృతివనాల్లో సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ నేపథ్యంలో మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పల్లె ప్రకృతి వనంలో శనివారం శుభ్రం చేసే పనులు చేపట్టారు. సర్పంచ్ చాట్ల భాగ్యమ్మ, ఎంపీటీసీ పూనెం లింగమ్మ, కార్యదర్శి మల్లేష్ పర్యవేక్షించారు.

దంపతులపై కేసు నమోదు

పాల్వంచరూరల్: దాడి ఘటనలో శనివారం భార్యాభర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధి యానంబైలు గ్రామానికి చెందిన లింగం పెల్లి రాజు ఈ నెల 22న రాత్రి 11 గంటలకు తన భార్యతో గొడవపడి ఇంట్లోనుంచి రోడ్డు మీదకు వచ్చి తిడుతున్నాడు. అదే సమయంలో ఎదురింటి కంటెం మధు, రాణి దంపతులు బయటకు వచ్చి రాజుతో గొడవపడి కర్రతో దాడి చేశారు. బూతులు తిట్టారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు శనివారం ఫిర్యాదు చేయగా కేసు భార్యాభర్తలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

గంజాయి స్వాధీనం



నిందితుడు, గంజాయిని చూపిస్తున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ అధికారులు శనివారం పట్టణంలోని కూనవరం రోడ్డులో తనిఖీలు చేపట్టి సుమారు 20కేజీల ఎండు గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, కారును సీజ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు జనార్దనరెడ్డి, గణేష్, జానయ్య, ఎస్కె రహీమున్నీషా బేగం తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

కూనవరం రోడ్డులో 5 క్వింటాళ్లు?

పట్టణంలోని కూనవరం రోడ్డులో ట్రాక్టర్‌లో తరలిస్తున్న 5 క్వింటాళ్ల గంజాయిని శనివారం సాయంత్రం పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. సీఆర్‌పీఎఫ్ క్యాంపువద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో గంజాయి తరలిస్తున్న ఇద్దరు ఒడిశా వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

యువతి అదృశ్యం

టేకులపల్లి: యువతి అదృశ్యంపై పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదయింది. టేకులపల్లి ఎస్‌ఐ రమణారెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని బిల్లుడుతండా పంచాయతీ జెండాలతండాకు చెందిన బాణోతు దివ్య శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో రాత్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగ్య తండాకు ఓ యువకుడిపై అనుమానం ఉన్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరికి గాయాలు

పాల్వంచ: డాబాపై ఆడుకుంటుండగా ఇద్దరు విద్యార్థులు శనివారం విద్యుదాఘాతానికి గురయ్యారు. వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని సబ్ స్టేషన్ వెనుక లైన్‌లో కట్టా నాగేశ్వరరావు ఇంటి మీదుగా 33/11 కేవీ విద్యుత్ లైన్ వెళ్తోంది. అతని 13ఏళ్ల కుమారుడు సాయి లోకేశ్, మిత్రుడు త్రివేణ్ కుమార్‌తో కలిసి ఇంటిపైన ఆడుకుంటున్నారు. ఈ క్రమంలో పిట్ట గోడ ఎక్కి దూకే క్రమంలో విద్యుత్ తీగలు తగలి విద్యుదాఘాతానికి గురయ్యారు. గమనించిన కుటుంబీకులు చిన్నారులను చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. త్రివేణ్‌కుమార్‌ను మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. సాయి లోకేశ్‌కు స్వల్ప గాయాలు కావడంతో ఇక్కడే చికిత్స పొందుతున్నాడు. కాగా త్రివేణ్ కుమార్ తండ్రి జాన నాగేశ్వరరావు వ్యానడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థులు గాయపడ్డారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రామాలయంలో అక్రమాల పర్వం

- దేవస్థానంలో కదులుతున్న అవినీతి డొంక
- ఉద్యోగ నియామకాల్లో భారీగా అవకతవకలు
- నాదస్వర ఉద్యోగిపై తాజాగా వేటు, మరో ఇద్దరిపై చర్యలకు సిద్ధం!



రామాలయం వ్యూ

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో అవినీతి డొంక కదులుతోంది. ఒక్కొక్కరి అక్రమ బాగోతాలు బయటపడుతున్నాయి. పది రోజుల క్రితం అనధికారికంగా సెక్యూరిటీ విభాగంలో ఇద్దరు వ్యక్తులు పనిచేసిన విషయం వెలుగులోకి రాగా, విచారణ జరుగుతోంది. గత శుక్రవారం అవినీతి ఆరోపణలతో నాదస్వర ఉద్యోగి సస్పెన్షన్‌కు గురయ్యాడు. ఈ నేపథ్యంలో ఆలయంలోని పలు విభాగాల్లో జరిగిన అవినీతి వ్యవహారంపై ఆధారాలు సేకరిస్తున్నట్లు తెలుస్తుండగా.. సంబంధిత ఉద్యోగుల్లో కలవరం మొదలైంది.

వరుసగా వెలుగుచూస్తున్న అక్రమాలు

పది రోజుల క్రితం ఆలయ రక్షణలో అత్యంత ప్రధానంగా భావించే సెక్యూరిటీ విభాగంలో ఆలయ ఈఓకు, సదరు కాంట్రాక్టర్‌కు తెలియకుండానే ఇద్దరు వ్యక్తులు మూడు నెలలు పనిచేసిన విషయం బహిర్గతమైంది. ఆలయ రక్షణకు భంగం కలిగించే విధంగా అనధికార వ్యక్తులు అనుమతి లేకుండా ప్రవేశించారని పేర్కొంటూ ఈఓ రమాదేవి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనలో దేవస్థాన కార్యాలయంలోని కీలక విభాగాల్లో పనిచేసే 'ఓ ఇద్దరు ఉద్యోగులు' పాత్ర ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. వారిని పోలీసులు కూడా విచారించినట్లు సమాచారం. విచారణ నివేదిక అందిన తర్వాత కమిషనర్ ఆదేశాల మేరకు ఈఓ చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలయంలో స్వామి వారి క్రతువులలో పనిచేసే నాదస్వర ఉద్యోగి ఎల్.కేశన్న అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురి కావడం ఆలయ ఉద్యోగుల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. రాష్ట్రంలోని పలు దేవాలయాల్లో ఉద్యోగుల నియామకాల్లో భారీ స్థాయిలో నగదు లావాదేవీలు నడిచినట్లు ఆధారాలు లభించటంతో కమిషనర్ ఆదేశాల మేరకు ఈఓ సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఘటనలో ఇతనితో పాటు ఇంకెవరైనా ఉన్నారా..? అనే కోణంలో విచారణ జరుగుతున్నట్లు సమాచారం.

బినామీ పేరుతో రామా నిలయం నిర్వహణ

భద్రాచలం వచ్చే భక్తుల వసతి కష్టాలు చెప్పవలనవి కావు. ఉన్న వసతి గృహాలే తక్కువ. అందులో 80 గదులకు పైగా రామాలయం సమీపంలో ఉన్న శ్రీ రామానిలయాన్ని ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణకు అప్పగించారు. దీని వెనుక సైతం ఓ ఇద్దరు ఉద్యోగుల పాత్ర ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. పక్కనే ఉన్న 30 గదులు ఉన్న సీతానిలయాన్ని రూ.లక్షకు అద్దె ప్రాతిపదికన ఇవ్వగా, 80 గదులు ఉన్న శ్రీరామా నిలయాన్ని కేవలం రూ.90 వేలకు అప్పగించటంలో ఆ ఇద్దరు ఉద్యోగులే కీలకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. రాజకీయ నాయకులకు, ఇతరులకు అప్పనంగా వసతి గదులను ఇవ్వాల్సి వస్తోందని, వీటిని ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణకు ఇస్తే అద్దె వస్తోందంటూ మభ్యపెట్టగా, ఉన్నతాధికారులు నమ్మి తక్కువ అద్దెకు కట్టబెడుతూ తీర్మానం చేస్తూ సంతకాలు పెట్టారు. అయితే ఆ ఇద్దరు ఉద్యోగులే బినామీతో రామానిలయం నిర్వహణను నడిపిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై కూడా విచారణ సాగుతుండగా, అక్రమాలు ఉన్నట్లుగా తేలితే ఆ కాంట్రాక్ట్‌ను రద్దు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఆడిట్ అభ్యంతరాలపై నిఘా పెడితే..

రామాలయంలో ప్రతిఏడాది జరిగే ఆడిట్‌లో విచారణ అధికారులు పదుల సంఖ్యలో అభ్యంతరాలు తెలుపుతున్నారు. అయినా విచారణ జరిపి, చర్యలు తీసుకున్నట్లు కనిపించదు. ఉద్యోగులు దేవస్థానంలో జరిగే పనుల కోసం ఇష్టారీతిన అడ్వాన్స్ తీసుకున్నట్లు సమాచారం. ఈఓ ప్రశ్నించడంతో లెక్కల చూపెట్టేందుకు కిందా మీద పడుతున్నట్లు తెలుస్తోంది. వీటిపై లోతుగా విచారణ చేపడితే అవినీతి అక్రమాలు బయటపడుతాయని పలువురు పేర్కొంటున్నారు.

ఇద్దరు ఉద్యోగులకు మెమోలు?

రామాలయం వంట స్టోర్స్‌లో పనిచేసే ఇద్దరు శాశ్వత ఉద్యోగులు అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించిన పర్యవేక్షణా కమిటీ మెమోల జారీకి సిఫార్సు చేసినట్లు సమాచారం. సదరు ఉద్యోగులకు ఆదివారం ఈఓ మెమోలు ఇవ్వనున్నట్లు తెలిసింది.



కొత్తగూడెం స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ప్రయాణికులు

చేరాల్సిన సమయానికి బయలుదేరింది!

- కొత్తగూడెం రావాల్సిన ప్రయాణికుల జాగారం
- సికింద్రాబాద్ నుంచి ఒకే రైలు ఉండడంతో రద్దీ
- ప్రణాళికాలన్నీ తారుమారయ్యాయని పలువురి ఆవేదన

కొత్తగూడెంఅర్బన్: వరంగల్ జిల్లా నెక్కొండ రైల్వే స్టేషన్ వద్ద జరుగుతున్న మూడో లైన్ నిర్మాణ పనులతో అధికారులు పలు రైళ్లను రద్దు చేశారు. అలాగే, మరికొన్నింటిని రీ షెడ్యూల్ చేశారు. ఈ నేపథ్యాన సికింద్రాబాద్ నుంచి కొత్తగూడెం మార్గంలో ప్రస్తుతం సికింద్రాబాద్ – మణుగూరు ఎక్స్‌ప్రెస్ మాత్రమే నడుస్తోంది. అయితే, సాంకేతిక కారణాలు, ఇతర సమస్యలతో ఈ రైలు గంటల తరబడి ఆలస్యంగా రాకపోకలు సాగిస్తుండడంతో కొత్తగూడెం రావాల్సిన వారు సికింద్రాబాద్ స్టేషన్‌లో జాగారం చేయాల్సి వస్తోంది. ఈక్రమంలో శుక్రవారం రాత్రి కూడా అదే పరిస్థితి ఎదురైంది. ఈ రైలు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం సికింద్రాబాద్‌లో రాత్రి 11.45 గంటలకు బయలుదేరి కొత్తగూడెం స్టేషన్ మరుసటి రోజు తెల్లవారుజామున 4.15గంటలకు చేరుకోవాలి. కానీ శుక్రవారం రాత్రి అక్కడే శనివారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ప్రారంభమైంది. కానీ రాత్రి 11 గంటలకే స్టేషన్‌కు పిల్లాపాపలతో చేరుకున్న ప్రయాణికులు రైలు, స్టేషన్‌లో జగారం చేయాల్సి వస్తోంది. ఒకటే రైలు ఉండడంతో విపరీతమైన రద్దీ నెలకొనగా.. పిల్లలు, మహిళలు ఉక్కపోతతో అవస్థ పడ్డారు. చివరకు శనివారం ఉదయం ఈ రైలు కొత్తగూడెంకు 9.45గంటలకు చేరింది. అయితే, తెల్లవారుజామున చేరుకుని పనులు చక్కబెట్టుకోవచ్చని ప్రణాళికలు సిద్ధం చేసుకున్న పలువురు తమ షెడ్యూల్ తారుమారైందంటూ ఉస్సూరుమనడం కనిపించింది.

భద్రాచలం దర్శనానికి వెళ్లాలనుకున్నా..



కొత్తగూడేనికి రైలు చేరుకున్నాక భద్రాచలం వెళ్లి తెల్లవారుజామునే దర్శనం చేసుకోవాలని భావించాను. కానీ రైలు కొత్తగూడెంకు 9.45గంటలకు వచ్చింది. దీంతో షెడ్యూల్ తారుమారైంది. అలాగే, రద్దీతో చాలా ఇబ్బందులు పడ్డాం. – అఖిలేష్, కొత్తగూడెం

పనులు వాయిదా పడ్డాయి



తెల్లవారుజామునే కొత్తగూడేనికి రైలు చేరుకుంటే అనుకున్న ప్రకారం పనులు చేసుకునే వాళ్లం. కానీ సుమారు పది గంటలకు రైలు రావడంతో పనులన్నీ వాయిదా వేసుకున్నాం. వేసవి సెలవుల్లో మూడో లైన్ పనులు నిర్వహించడం సరికాదు.

– ఫణీంద్ర, కొత్తగూడెం



స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు

- హెచ్చరిక బోర్డులు లేక, రాత్రివేళ కనిపించక ప్రమాదాలు
- గోదావరి బ్రిడ్జి వద్ద ఇటీవల రెండు ఘటనల్లో ఇద్దరు మృతి
- నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతున్న వాహనదారులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లతో ప్రమాదాలు తగ్గకపోగా పెరుగుతున్నాయని పలువురు వాహనదారులు పేర్కొంటున్నారు. సరైన వెలుతురు లేకపోవడంతోపాటు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో రాత్రి వేళలో స్పీడ్ బ్రేకర్లు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గోదావరి బ్రిడ్జి దాటాక భద్రాచలం వైపు సుమారు 300 దూరంలో వీటిని ఏర్పాటు చేశారు. ఇదే ప్రదేశంలో ఇటీవల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటనలు పరిశీలిస్తే స్పీడ్ బ్రేకర్లు కనిపించకపోవడం వల్లే ప్రమాదాలు జరిగినట్లు అర్థమవుతోంది.

- ఈ నెల 8న లకావత్ శ్యామ్, బేబి (33) దంపతులు బైక్‌పై సారపాక నుంచి భద్రాచలం వస్తున్నారు. స్పీడ్ బ్రేకర్ వద్ద శ్యామ్ ద్విచక్రవాహన వేగం తగ్గించాడు. ఈ క్రమంలో వెనుకవైపు నుంచి అతివేగంగా వస్తున్న డీసీఎం బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బేబి అక్కడికక్కడే మృతి చెందింది.
- రహదారి మార్గంపై అవగాహన శ్యామ్ బైక్ స్పీడ్ తగ్గించినా, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో డీసీఎం వ్యాన్ డ్రైవర్ వేగం తగ్గించలేదని, అందువల్లే ప్రమాదం జరిగి బేబి మృతి చెందిందని స్థానికులు, వాహనదారులు పేర్కొంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు.
- ఇక్కడ పరిస్థితిని గమనించిన పట్టణానికి చెందిన ఓ యువతి స్వచ్ఛందంగా ఆ స్పీడ్ బ్రేకర్లకు పెయింట్ వేసింది. భద్రాచలం వచ్చే వాహనాల సంఖ్య అధికంగా ఉండటంతో ఆ పెయింట్ ఒక్క రోజులోనే కనిపించకుండా పోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా హెచ్చరిక బోర్డులు, రాత్రి వేళ వెలుతురు ఎక్కువగా ఉండేలా లైట్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బైక్ అదుపు తప్పి..

భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దుమ్ముగూడెం మండలం రేగుబల్లికి చెందిన కాళ్ల వినోద్ (29) మణుగూరులో డంపర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. విధులు ముగించుకుని శుక్రవారం అర్ధరాత్రి 2:30 గంటల సమయంలో బైక్‌పై వస్తున్న క్రమంలో స్పీడ్ బ్రేకర్లు సరిగ్గా కనిపించకపోవడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పరీక్షించి వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. వినోద్ భార్య మౌనిక ఆరు నెలల గర్భిణి. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా వినోద్ తండ్రి వెంకటేశ్వర్లు ఆరు నెలల క్రితమే మృతి చెందాడు.



గాయపడి మృతి చెందిన వినోద్

ఓటమితో గెలుపునకు బాటలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఏపీఓ డేవిడ్‌రాజ్

దుమ్ముగూడెం: విద్యార్థులు పరీక్షల్లో ఓసారి ఫెయిల్ అయినంత మాత్రాన నిరుత్సాహ పడకుండా మరోమారు విజయం కోసం ప్రయత్నించాలని ఐటీడీఏ ఏపీఓ (జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ సూచించారు. దుమ్ముగూడెం మండలం కె.రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి విద్యార్థుల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్నందున పదో తరగతిలో ఫెయిల్ అయిన వారు నిరుత్సాహపడకుండా అడ్వాన్స్ సప్లిమెంటరీకి సిద్ధం కావాలని సూచించారు. ఇందుకోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతిలో ఫెయిల్ అయిన విద్యార్థుల కోసం ఆరు సెంటర్లలో క్యాంపులు నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, ఏటీడీఓ నర్సింగరావు, హెచ్ఎం నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంకేర్‌లో ఎదురుకాల్పులు : ముగ్గురికి గాయాలు

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా పఖాంజూర్ బార్‌గావ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం పోలీసు బలగాలు, మావోయిస్టుల నడుమ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు జవాన్లకు గాయాలు కాగా, మహిళా మావోయిస్టు ఎల్ఓఎస్ కమాండర్ పగ్ని గాయాలతో పోలీసులకు పట్టుబడింది. యాంటీ నక్సల్ ఆపరేషన్‌లో భాగంగా మెంద్రా అడవుల్లో బీఎస్ఎఫ్ బలగాలు, జిల్లా పోలీసులు సంయుక్తంగా రెండు రోజుల నుంచి కూంబింగ్ చేపడుతున్నారు. ఈక్రమాన శనివారం ఉదయం మావోయిస్టులు ఎదురుపడటంతో సుమారు గంట పాటు ఎదురు కాల్పులు జరిగాయి. మావోయిస్టు పార్టీ ఎల్ఓఎస్ కమాండర్ పగ్ని గాయాలతో పట్టుబడగా ఇద్దరు జవాన్లకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు వివరాలను పఖాంఖ్ సబ్ డివిజనల్ అధికారి రవికుజూర్ వెల్లడించారు.

కార్డు ఇచ్చి కానరాకుండా పోయిన వరుడు

ఈ నెల 31న వివాహం

ఇల్లెందు: పెళ్లి కుమార్తె ఇంట్లో తొలి కార్డు ఇచ్చిన వరుడు.. ఆ మరుసటి రోజు నుంచి కానరాకుండా పోవడంతో మరో మూడు రోజుల్లో వివాహం జరగాల్సి ఉన్న నేపథ్యాన ఇరుకుటుంబాల్లో ఆందోళన నెలకొంది. వివరాలు... పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామానికి చెందిన నాగేశ్వరరావు– మంగ కుమారుడు సందీప్ వివాహం ఇల్లెందు 14 నంబర్ బస్తీకి చెందిన యువతితో నిశ్చయమైంది. దీంతో ఈనెల 21న ఆమె ఇంటికి వచ్చిన సందీప్ పెళ్లి కార్డు ఇచ్చి ఆ రాత్రి అక్కడే ఉన్నాడు. మరుసటి రోజు ఉదయం ఖమ్మంలో కార్డులకు ఇచ్చేందుకు వెళ్తున్నట్లు చెప్పి బయలుదేరాడు. ఆ తర్వాత ఆయన ఫోన్ స్విచాఫ్ వస్తుండడంతో ఎక్కడ వెతికినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో సందీప్ కుటుంబ సభ్యులు ఇల్లెందు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఈనెల 31న వివాహం జరగాల్సి ఉండడంతో ఇరు కుటుంబాల సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

బంగారం ఉన్న పర్సు మాయం

టేకులపల్లి: మూడు తులాల బంగారం ఉన్న పర్సు కనిపించకుండా పోయిన సంఘటన మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. టేకులపల్లి మండలం రామచంద్రునిపేట గ్రామానికి చెందిన ఉమ్మగాని పద్మ శనివారం కొత్తగూడెం వెళ్లి తిరిగి వచ్చి టేకులపల్లి సెంటర్‌లో ఓ దుకాణంలో కూరగాయలు కొనుగోలు చేసింది. తన పర్సులో డబ్బులు తీసి ఇచ్చింది. కూరగాయల బ్యాగు తీసుకుని వెళ్లేటప్పుడు పర్సుతో పాటు మొబైల్ ఫోన్‌ని అక్కడే మరిచిపోయింది. కొంతదూరం వెళ్లాక పర్సు మరిచిపోయినట్లు గుర్తించి తిరిగి కూరగాయల షాపు వద్దకు వచ్చింది. మొబైల్ అక్కడే ఉంది. కానీ పర్సు మాయమైంది. పర్సులో కొంతనగదుతో పాటు మూడు తులాల బంగారు గొలుసు ఉందని బాధితురాలు వాపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్లు టేకులపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెలిపారు.

జోరుగా మట్టి దందా!

పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ శాఖలు



జేసీబీతో ట్రాక్టర్‌లో మట్టి నింపుతున్న దృశ్యం

అశ్వారావుపేటరూరల్: ఓ ప్రభుత్వ ఉద్యోగి అండతో జోరుగా మట్టి దందా సాగిస్తున్నారు. అనుమతులు లేకుండానే పట్టపగలే గుట్టను తవ్వి గ్రావెల్ మట్టి అక్రమంగా తరలిస్తున్నారు. ఈ వ్యవహారం శనివారం వెలుగులోకి వచ్చింది. మండలంలోని నారాయణపురం గ్రామ పంచాయతీ నెమలిపేట సమీపంలోని గుట్ట నుంచి కొందరు అక్రమార్కులు మూడు రోజులుగా జేసీబీలతో మట్టి తవ్వకాలు సాగిస్తున్నారు. 10 ట్రాక్టర్లతో రోజుకు 100 నుంచి 150 ట్రిప్పుల మట్టి తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఒక్కో ట్రిప్పునకు రూ.700 నుంచి రూ.800 వరకు విక్రయిస్తూ లక్షల రూపాయలు సొమ్ము చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రెవెన్యూ శాఖలోని ఓ అధికారి అండదండలతో యథేచ్ఛగా తవ్వకాలు సాగించడం గమనార్హం. ఈ దందా ప్రభుత్వ సెలవు దినాలు, అధికారులు సెలవు పెట్టే రోజుల్లోనే సాగుతుండటంతో అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై తహసీల్దార్ లూథర్ విల్సన్‌ను 'సాక్షి'వివరణ కోరగా.. తాను స్థానికంగా అందుబాటులో లేనని, మట్టి తవ్వకాలు ఈ రోజే తన దృష్టికి వచ్చిందని తెలిపారు. సిబ్బంది అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి పంపామని, అప్పటికే తవ్వకాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. మట్టి తవ్వకాలకు తాము అనుమతి లేదని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205